క్లుప్తంగా

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కనగల్: సీఆర్పీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నల్లగొండ పట్టణంలోని డీఈఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేయనున్నట్లు తెలంగాణ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరందాసు సంతోష్‌కుమార్, ధార వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ధర్నాకు సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్పీలు, ఐఈఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెసెంజర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, కేజీబీవీ, యూఆర్ఎస్ బోధన, బోధనేతర సిబ్బంది తరలిరావాలని పిలుపునిచ్చారు.

పాస్టర్ ఫెలోషిప్ మండల కమిటీ ఎన్నిక

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెంలోని బేతనీయ క్రిస్టియన్ మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ ఫెలోషిప్ నూతన మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పేర్ల శ్యాంసన్, జనరల్ సెక్రటరీగా పుల్లలా లాజర్, కోశాధికారిగా ఉట్కూరు మోహన్, ఉపాధ్యక్షుడిగా వేల్పుల డేనియల్, సెక్రటరీగా మండల ప్రభావతి, గౌరవ అధ్యక్షులుగా రాగి ఫిలిప్‌రాజ్, దాసరి ప్రీతి ప్రశాంత్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

దివ్యాంగుల పాలిట దేవుడు సీఎం కేసీఆర్

కనగల్: దివ్యాంగుల పింఛన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.3016 నుంచి రూ.4016 పెంచడాన్ని హర్షిస్తూ ఆదివారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు గుండెబోయిన ఉపేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దివ్యాంగుల పాలిట దేవుడని కొనియాడారు. కార్యక్రమంలో వెంకన్న, బోగరాజు జానీ, నాగయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

మర్రిగూడ: మండల కేంద్రంలోని గ్రామభారతి ఆవాసంలో నివసిస్తూ విద్యనభ్యసిస్తున్న అనాథ విద్యార్థులకు మర్రిగూడ మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన బండి శేఖర్‌గౌడ్ ఆదివారం రూ.10వేల విలువ గల స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అదేవిధంగా పండ్లు, ఇతర సామగ్రిని సైతం అందజేశారు. కార్యక్రమంలో పాల్వాయి జగత్‌రెడ్డి, కొడిచర్ల గిరి, బడేటి జంటయ్య, కొంపెల్లి జంగయ్య, ముద్దం రవీందర్, వెంకటయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌సీసీకి 50మంది విద్యార్థినులు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

నకిరేకల్: నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ సెలక్షన్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో భాగంగా పాఠశాల నుంచి 8వ తరగతి విద్యార్థినులు 50మంది ఎన్‌సీసీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారిణి నవనీత, సుబేదార్ సోహన్, లాలా హల్దార్, సంతోష, బ్రిజ్మోహన్ సింగ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

మునుగోడు: మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన పలువురు బీజేపీ బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి సమక్షంలో మండల పార్టీ నాయకుడు కందుల సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి చలమల్ల కృష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో వీరమల్ల రాజు, గుర్జ ప్రదీప్, కందుల రాజుగౌడ్, వట్టికోటి ప్రశాంత్, ప్రవీణ్, చందు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహాగౌడ్, కందుల నర్సింహ, ఏపూరి యాదయ్య తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి

నల్లగొండ టూటౌన్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్ అన్నారు. ఆదివారం ఉదయం 10గంటల 10నిమిషాలకు మున్సిపల్ ఉద్యోగులు పట్టణంలోని 27వ వార్డులో ఇంటింటికి వెళ్లి దోమల ద్వారా వచ్చే వ్యాదులు, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, గడ్డం శ్రీనివాస్, జవాన్లు పరశురాము, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డంతా గుంతలమయం



నకిరేకల్‌లోని మార్కెట్ సమీపంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు



అస్తవ్యస్తంగా మారిన నకిరేకల్ నుంచి శాలిగౌరారం వెళ్లే రహదారి

- పన్నాలగూడెం నుంచి సిరాంచ హైవే వరకు వెళ్లాలంటేనే జంకుతున్న ప్రయాణికులు
- డబుల్ లేన్‌గా విస్తరించాలని డిమాండ్

నకిరేకల్: పట్టణంలోని పన్నాలగూడెం మూలమలుపు నుంచి శాలిగౌరారం మండలానికి వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. ప్రధానంగా పన్నాలగూడెం నుంచి నకిరేకల్ శివారులోని సిరాంచ బైపాస్ వరకు ఉన్న మూడు కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి ఇరుకుగా ఉంది. ఈ రోడ్డు సింగిల్ రోడ్డుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం పన్నాలగూడెం నుంచి సిరాంచ హైవే వరకు ఉన్న ఈ మూడు కిలోమీటర్ల ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో గుంతల్లో వర్షం నీరు చేరడంతో వావనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.ప్రతి ఏటా వర్షాకాలంలో రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారుతోందని, అధికారులు నామమాత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ దారి గుండా శాలిగౌరారం,అర్వపల్లి, మోత్కూర్, అడ్డగూడూరు, నార్కట్‌పల్లి మండలాల వైపు ఆర్టీసీ బస్సులు, ఆటోలు, వాహనదారులు నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. రోజుకు వందలాదిగా వాహనాలు ఈ దారి గుండా వెళ్తుంటాయి. ద్విచక్ర వాహనదారులు కూడా రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మూడు కిలో మీటర్ల రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

డబుల్ రోడ్డుగా విస్తరించాలి



నకిరేకల్‌లోని పన్నాలగూడెం నుంచి శాలిగౌరారం .అర్వపల్లి మండలాలకు వెళ్లే ప్రధాన రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాలి. స్థానిక పత్తిమిల్లు వరకు మూడు కిలోమీటర్ల మేర రహదారి ఇరుకుగా ఉండటంతో పాటు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వావనాదారుల ప్రమాదాల బారిన పడుతున్నారు. తక్షణమే రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి డబుల్ రోడ్డుగా విస్తరించాలి.

– ముద్దం విజయ్, నకిరేకల్

కేసీఆర్ ప్రభుత్వానికి అండగా ఉండాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



దివ్యాంగులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి ప్రజలు అండగా ఉండి గెలిపించాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్‌ను మరో రూ.1000 పెంచుతూ నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ ఆదివారం నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రతిపక్షాలు ఎన్ని మాయమాటలు చెప్పినా తెలంగాణ ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారన్నారు. సంక్షేమ రంగంలో పెను మార్పులు తెచ్చి ప్రతిఒక్కరి జీవితాల్లో సీఎం కేసీఆర్ సంతోషం నింపారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీలు మాధ ధనలక్ష్మీనగేష్, తలారి బలరాం, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు రాచకొండ సునీల్, పల్లె విజయ్, బానోతు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే కరాటే నేర్చుకోవాలి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రాపోలు సుదర్శన్

నల్లగొండ టూటౌన్: విద్యార్థి దశ నుంచే కరాటే నేర్చుకోవాలని జపాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ మాస్టర్ రాపోలు సుదర్శన్ అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని అన్‌స్టాపబుల్ కరాటే జిమ్నాస్టిక్ అకాడమిలో బెల్ట్ టెస్టింగ్, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కరాటే నేర్చుకోవడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచే కరాటే నేర్చుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఐబీసీ ఎండీ ఏచూరి శైలజ, మాస్టర్ నర్సింహాచారి, అకాడమీ డైరెక్టర్ మాస్టర్ పవన్, నరేష్, సాగర్, నిఖిల్, వంశీ, అఖిల్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఆలయాల అభివృద్ధికి కృషి



పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి: గ్రామాల్లో స్వచ్ఛందంగా ఏర్పాటు చేస్తున్న దేవాలయాల అభివృద్ధికి కృషిచేస్తామని జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని చిన్న తుమ్మలగూడెం గ్రామ శివారులో గల శ్రీపట్టాభి రామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన మండల పూజ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించిన అనంతరం వారికి దేవాలయ అర్చకుడు ఆశీర్వచనం అందించగా, ఆలయ వ్యవస్థాప అధ్యక్షుడు ఉంట్ర లింగారెడ్డి సన్మానించారు. అనంతరం జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం దేవాలయం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఉంట్ర భాగ్యమ్మలింగారెడ్డి, బొక్క కనకమ్మ, మాల్గ రవీదర్‌రెడ్డి, మల్లెబోయిన సైదులు, పసునూరి శ్రీనివాస్, గుండె రవి, సోమ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రజకులకు 'బీసీ బంధు' ఇవ్వాలి

చండూరు(గట్టుప్పల్) : రాష్ట్ర ప్రభుత్వం బీసీ బంధు పథకం తీసుకొచ్చి ప్రతి రజక కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని రజక సంఘం జిల్లా నాయకుడు పగిళ్ల భిక్షం అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రజక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రజకులకు వాషింగ్ మిషన్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో శంకర్, పగిళ్ల యాదయ్య, జంగయ్య, రమేష్, కిరణ్, మహేష్, ఆది, సాయి, కుమార్, వంశీ, శివ తదితరులు ఉన్నారు.

మేరు సంఘం కమిటీ ఎన్నిక

నల్లగొండ టౌన్: మేరు సంఘం పట్టణ కమిటీని ఆదివారం జిల్లా మేరు సంఘం భవనంలో ఎన్నికల పరిశీలకులు కొక్కు మోహన్, గుంటి మల్లికార్జున్ సమక్షంలో ఎన్నుకొని ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా నామా రాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా పొన్నగంటి కిరణ్ కుమార్, టంగుటూరి ప్రకాష్, రేణిగుంట్ల వెంకన్న, మహిళా కార్యదర్శి జయంతి, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కొవ్వూరు శ్రీనివాస్, కార్యదర్శులుగా ఆడప నరసింహ, కొక్కు ఆంజనేయులు, మునగాల మహేష్, ప్రకాష్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వినోద్, శేఖర్, రాజేష్, రామప్ప ఎన్నికయ్యారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

నకిరేకల్: నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సాయి మందిర కల్యాణ మండపంలో ఐకాన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శివప్రసాద్, డాక్టర్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్లు 624 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ, టీపీసీసీ నేత దైద రవీందర్, జోన్ చైర్మన్ రావిరాల అశోక్, డాక్టర్లు శశాంక్, రవి, శంకర్, శశింద్ర, క్లబ్ ప్రతినిధులు బాణాల రాంరెడ్డి, ఎన్. రాంమోహన్‌రావు, శాంతయ్య, జెల్ల దశరథ, వరకాంతం నారయణరెడ్డి, లోకసాని అనిత తదితరులు పాల్గొన్నారు.

41వ వార్డులో హెల్త్ క్యాంపు

నల్లగొండ టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 41వ వార్డు ఎస్పీఆర్ స్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ క్యాంపులో 800 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రివర్ నిమ్స్ డాక్టర్లు వెంకట్‌రెడ్డి, కీర్తిరెడ్డి, వార్డు సభ్యులు మామిడాల రమేష్, సింధు, రామ్మోహన్, లవకుమార్, విద్యాసాగర్, వేదాంతం శ్రీనివాసాచారి, హరి, నాగరాజు, ప్రఖ్యాత్, రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు తప్పని తిప్పలు



పిట్టంపల్లిలో చెత్త ట్రాక్టర్ నడుపుతూ చెత్త సేకరిస్తున్న ఉప సర్పంచ్ మెట్టు పరమేష్

చిట్యాల: గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండడంతో ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చిట్యాల మండలంలోని పలు గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులే స్వయంగా రంగంలోకి దిగి పారిశుద్ధ్య చర్యల్లో పాల్గొంటున్నారు. పిట్టంపల్లి గ్రామంలో ఉప సర్పంచ్ మెట్టు పరమేష్ చెత్త ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ గ్రామంలో చెత్త సేకరిస్తున్నాడు. మరోవైపు వెలిమినేడు గ్రామపంచాయతీ సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ ఆ గ్రామంలోని పలు వార్డుల్లో మురుగు కాల్వలను స్వయంగా పారతో శుభ్రం చేస్తోంది.

బీజేపీ హయాంలోనే మహిళలపై దాడులు

నార్కట్‌పల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో మైనార్టీపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు పెరిగాయని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నార్కట్‌పల్లి మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని మోదీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అని చెప్పి నిరుద్యోగ యువతను మోసగించారని ఆరోపించారు. రైతులు, కార్మికులు ఉద్యోగులు, మహిళలకు బీజేపీ ప్రభుత్వం వలన ప్రయోజనం ఏమీ లేదని అన్నారు. సీపీఎం కార్యకర్తలు ప్రజా సమస్యలపై పోరాటం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, జిట్ట నగేష్, పెంజర్ల సైదులు, జిట్ట సరోజ, నార్కట్‌పల్లి, చిట్యాల మండల పార్టీ కార్యదర్శులు చెరుకు పెద్దులు, ఆరూరీ శ్రీను, చింతపల్లి బయన్న, గాలి నర్సింహ, దండు రవి, శంకర్‌రెడ్డి, నాగరాజు, మోహన్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



నార్కట్‌పల్లి: పల్లెపహాడ్ గ్రామంలో మాట్లాడుతున్న మందారి డేవిడ్‌కుమార్

నార్కట్‌పల్లి: ప్రధాన మంత్రి మోదీ, సీఎం కేసీఆర్ ప్రభుత్వాలు ఫాసిస్ట్ విధానాలను అనుసరిస్తున్నాయని, వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ రాష్ట్ర నాయకుడు మందారి డేవిడ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పల్లెపహాడ్ గ్రామంలో సరసనపల్లి అమరుడు పజ్జూరి కృష్ణారెడ్డి 23వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఉద్యమకారులు, మేధావులను నిర్బంధించే ప్రయత్నం చేస్తోందని హెచ్చరించారు. 2000 సంవత్సరంలో సరసనపల్లి అడవులను చుట్టుముట్టి పజ్జూరి కృష్ణారెడ్డితో పాటు భరత్, రాజును బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారని అన్నారు. వారి ఆశయ సాధన కోసం బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరు సాగర్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బొంగరాల నర్సింహ, బొమ్మిడి నగేష్, మామిడోజు వెంకన్న,అంబటి చిరంజీవి, బీవీ చారి, సిలువేరు జానయ్య, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మల్టీపర్పస్ విధానం తక్షణమే రద్దు చేయాలి



చండూరు: సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న శివకుమార్



కనగల్: మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న గ్రామపంచాయతీ కార్మికులు



మునుగోడు: అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

చండూరు: గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్ డిమాండ్ చేశారు. చండూరు మండల కేంద్రంలోని చౌరస్తాలో గ్రామపంచాయతీ కార్మికుల చేపట్టిన సమ్మె ఆదివారం 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన సమ్మెలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మోగుదాల వెంకటేష్, తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏర్పుల సైదులు, నాంపల్లి శంకరయ్య, బానావత్ సురేష్‌నాయక్, బొమ్మరబోయిన పుష్పలత, సునీత తదితరులు పాల్గొన్నారు

కొనసాగుతున్న సమ్మె

మర్రిగూడ: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మర్రిగూడ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 18వ రోజు కొనసాగింది. ఈ సమ్మెకు కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్ మద్దతు తెలిపి మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడం దారుణమన్నారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.19వేలు అందించాలని, ప్రమాద బీమా వర్తింపచేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెరుమాండ్ల మంజుల, రమణ, నక్క నరసింహ, సునీత, హనుమంతు, జంగమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన

కనగల్: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం సైతం కొనసాగింది. ఈ సందర్భంగా ఆ సంఘం మండలాధ్యక్షుడు జిల్లా విజయ్ మాట్లాడుతూ.. చాలా రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహించి మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు శంకర్, ముత్తయ్య, వెంకన్న, రాజయ్య, కిరణ్, పాపయ్య, సాలమ్మ, రేణుక, మంజుల తదితరలున్నారు.

సమ్మెకు మద్దతు

చిట్యాల: గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు జిల్లా యువజన సంఘాల సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మేడి హరికృష్ణ మద్దతు తెలిపారు. ఆదివారం చిట్యాలలో పంచాయతీ కార్మికులు చేపట్టిన భిక్షాటన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

నాంపల్లిలో..

నాంపల్లి: మండల కేంద్రంలో సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 60 ప్రకారం కనీస వేతనం రూ.19,500 ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పల్లెటి హరికృష్ణ, వెంకటయ్య, గాదెపాక మరిమ్మ, సులోచన, పార్వతమ్మ, యాదమ్మ, జయమ్మ, బిక్కు, జైపాల్, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల రాస్తారోకో

మునుగోడు: గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా ఆదివారం మునుగోడులోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేవరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకలు రెడ్డిమల్ల యాదగిరి, పందుల నర్సింహ, అరుణ, ఎల్లమ్మ, కంభంపాటి లక్ష్మయ్య, నందిపాటి జలేందర్, నూకల పెద్దమ్మ, శంకర్, అందాలు తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళలకు రక్షణ లేకుండా పోయింది



తిప్పర్తిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఐద్వా నాయకులు

నల్లగొండ టూటౌన్: దళిత మహిళ రాష్ట్రపతిగా ఉన్న దేశంలో దళిత మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై అకృత్యాలకు పాల్పడి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించిన సమావేశంలో దళిత సంఘాల నాయకులు పాల్గొని మణిపూర్‌లో జరిగిన అమానుష ఘటనను ఖండించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రజలకు తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మామిడి బాలయ్య, దళిత సంఘాల నాయకులు కత్తుల షణ్ముఖ, కత్తుల మల్లేషం, కొంపల్లి భిక్షపతి, కత్తుల జగన్‌కుమార్, నాగుల నరసింహ, వంటేపాక యాదగిరి, రంగపూరి యాదయ్య, కట్టెల శివకుమార్ పాల్గొన్నారు.

మత రాజకీయాలు ఎక్కువయ్యాయి..

మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలకు పాల్పడి హత్య చేసిన నిందితులను శిక్షించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్ చంద్ర, పందిరి శ్యామ్‌సుందర్, గౌరవాధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, కోశాధికారి అబ్దుల్ ఖాదర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం సిగ్గుచేటని, మహిళల రక్షణ కంటే మత రాజకీయాలు ఎక్కువ అయ్యాయని అన్నారు. వెంటనే రాష్ట్రపతి, ప్రధాని చొరవ తీసుకొని అల్లర్లను అరికట్టాలని కోరారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్: మణిపూర్‌లో మహిళలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను శిక్షించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి డిమాండ్ చేశారు. నకిరేకల్‌లోని యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో ఆదివారం నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముగ్గురు ఆదివాసీ మహిళలను వివస్త్రను చేసి ఊరేగించి అసభ్యకరంగా ప్రవర్తించిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో నాయకులు పసుపులేటి సోమయ్య, మామిడోజు వెంకన్న, అంబటి నర్సయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

రామగిరి(నల్లగొండ): మణిపూర్ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగాయని ఆరోపిస్తూ ఆదివారం తిప్పర్తి మండల కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మణిపూర్‌లో ఘర్షణలకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల నాయకురాలు జంజరాల ఉమా, సీఐటీయూ మండల కన్వీనర్ భీమగాని గణేష్, మహిళా సంఘం నాయకులు మంత్రాల మంగమ్మ, భార్గవి, సీఐటీయూ నాయకులు కంచర్ల జానయ్య, పాలడుగు చంద్రయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

చండూరు: మణిపూర్ రాష్ట్రంలో ఇద్దరు ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. ఆదివారం చండూరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై లైంగిక దాడికి పాల్పడి, బాధితుల కుటుంబ సభ్యులను హత్య చేసినట్లుగా కూడా వార్తలు వస్తున్నాయని అన్నారు. దేశానికి చెడ్డ పేరు తెచ్చే ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయగౌడ్, సీఐటీయూ జిల్లా నాయకులు అద్దంకి నరసింహ, చిట్టిమల్ల లింగయ్య, కొత్తపల్లి నరసింహ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కట్టంగూర్: మండల కేంద్రంలోని సాందీపని ఉన్నత పాఠశాలకు చెందిన 2005–06 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కట్టంగూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, మెమొంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డిపల్లి సాగర్, హెచ్ఎం రాములు, పటేల్ నర్సిరెడ్డి, ప్రకాశ్, గుజ్జుల నాగిరెడ్డి, చింతల శ్రీనివాసరెడ్డి, గుండు నాగరాజు, అంజిరెడ్డి, పద్మ, కళావతి, లక్ష్మి, పూర్వ విద్యార్థులు మన్నెం వెంకటేశ్వర్లు, ఎర్కల వేణు, బొల్లేపల్లి వెంకన్న, రేకల అశోక్, గుండా విజయ్‌కుమార్‌రెడ్డి, ముత్యాల అశోక్, ప్రసాద్, నాగార్జున, పెద్ది సతీష్, రాజు, సరిత, మౌనిక, నాగమణి, శిల్ప, శ్వేత ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలో మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన సింగం పుష్పలత కుటుంబ సభ్యులను ఆదివారం ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజుయాదవ్ పరామర్శించి రూ. 20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో లింగస్వామి, ఉపేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మండలంలోని రావిగూడెం గ్రామానికి చెందిన బొల్లు హర్షిత్ ఇటీవల మృతిచెందాడు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పంపిన రూ.10వేల ఆర్థికసాయాన్ని ఆదివారం ఎంపీపీ కర్నాటి స్వామి మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుర్రం అంజయ్య, మాజీ ఎంపీటీసీ గుర్రం యాదయ్య, కోఆప్షన్ సభ్యుడు గుర్రం కృష్ణ, రెడ్డిమల్ల రాంశకర్, ఉడుత శ్రీశైలం, గుర్రం చిన్నయాదయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: మండలంలోని దేవత్‌పల్లి గ్రామానికి చెందిన మహ్మద్ బాషామియా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి ఆస్పత్రిలో బాషామియాను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఎరుకల నాగయ్యగౌడ్, జక్కుల రాజు, ముదిగొండ అశోక్, మహ్మద్ జహంగీర్, రాజు తదితరులు ఉన్నారు.